

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

గడువులోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలి

వికారాబాద్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై రెండో దఫాగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో రెవెన్యూ గ్రామం యూనిట్‌గా తీసుకొని సర్వే నంబర్ల వారీగా పంటసాగు వివరాలు సేకరించాలన్నారు. నీటి పారుదల, రైతు సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రుణాల సేకరణ రైతులు వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న వివిధ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం తదితర వివరాలను మొబైల్‌యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీపీవో అశోక్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు, ప్లానింగ్ స్టాటికల్ అధికారులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన కొడంగల్‌లో గురువారం పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా? ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు? పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా, నివేశన స్థలానికి సంబంధించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా..? అనే అంశాలను పరిశీలించారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఇప్పటి వరకు ఎంత మంది వివరాలను సేకరించారు. ఆన్‌లైన్‌లో ఎన్ని వివరాలను అప్‌లోడ్ చేశారని అధికారులతో మాట్లాడి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తూ తప్పిదాలకు తావు ఇవ్వకుండా వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే అలాంటి వారి వివరాలను కూడా యాప్‌లో పొందుపర్చాలన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూర్చేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్నీ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బాలరాంనాయక్, సిబ్బంది ఉన్నారు.

31లోగా గణనను పూర్తి చేయాలి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ గణనను ఈనెల 31లోగా పూర్తి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వి.శేఖర్ వ్యవసాయాధికారులను కోరారు. ఈమేరకు గురువారం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక, గణాంకా అధికారులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవసాయ గణన 2021-22 సంవత్సరం రెండో దశలో 34గ్రామాలు, 2022-23 సంవత్సరం మూడోదశలో 16గ్రామాల్లో గణను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి చంద్రకళ, బాలమణి, మాధవి, జిల్లాలోని వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పొలంలోనే మక్కలు కొని లారీలో తరలిస్తున్న వ్యాపారులు

మక్కలకు దిక్కేది?

బహిరంగ మార్కెట్‌లోనే గిట్టుబాటు

- ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225, మార్కెట్‌లో రూ.2,500పైనే
- నేటికీ ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- పొలాల నుంచే ఇతర రాష్ట్రాలకు తరలింపు
- భారీగా మార్కెట్ పన్ను ఎగవేస్తున్న వ్యాపారులు
- జిల్లాలో 8.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా

ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నలకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. మొక్కజొన్నలు క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2,225లు మద్దతు ధరను ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో రెండు వారాల క్రితం రూ.2,600ల వరకు ధర పలికింది.మార్కెట్ ధరల కంటే ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉండాల్సింది పోయి తక్కువగా ప్రకటించడం ఏమిటని మక్క రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసెత్తడం లేదు.

మద్దతు ధరపై రైతుల మండిపాటు



పరిగి మార్కెట్‌లో ఆరబెట్టిన మక్కలు

పరిగి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలకు మార్కెట్ ధరల కంటే ప్రభుత్వ మద్దతు ధర తక్కువగా ఉండటంతో మక్క రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడు, నాలుగు వందలు వ్యత్యాసం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2,225గా నిర్ణయించగా బహిరంగ మార్కెట్‌లో రూ.2,400 నుంచి 2,600 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర కల్పించడంలో అన్నదాత పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. అయినా నేటికీ

మిగతా 8వ పేజీలో...

మద్దతు ధర రూ.3వేలకు పెంచాలి



ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్నలకు రూ.2,225 మద్దతు ధరను ప్రకటించింది. అయితే అదే బహిరంగ మార్కెట్‌లో రూ.2,500లకు పైగా ధర పలుకుతోంది. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటికైనా మొక్కజొన్నలు క్వింటాల్ మద్దతు ధరను రూ.3,000కు పెంచాలి.

-చంద్రయ్య, మక్కరైతు, బాసుపల్లి

జీవాల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల కుమార్, కార్యదర్శి ఎక్కలదేవి కోమురయ్య అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని, జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. సబ్సిడీపై జీవాలకు దాణా అందజేయాలని, 50 సంవత్సరాలు దాటిన గొర్రెకాపారులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలన్నారు. ప్రమాదాల్లో చనిపోతున్న కాపారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. కేంద్ర ప్రభుత్వ ఎన్.ఎల్.ఎం పథకంలో గొల్లకురుమల యువతకు 50 శాతం ప్రత్యేకంగా అవకాశం కల్పించాలని, పాలన సమయం ముగిసిన సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ

ఘట్‌కేసర్‌లో 4,200 ఎకరాల్లో వరిసాగు

సరిపడా ఎరువులు, విత్తనాలు సిద్ధం

7



వైకల్యాన్ని జయించి.. క్రీడల్లో రాణించి!

జాతీయస్థాయి దివ్యాంగ పోటీల్లో యువకుడి ప్రతిభ

తెలంగాణ జట్టులో కీలకపాత్ర

6



మహిళలకు అండగా 'స్ఫూర్తి'

టైలరింగ్‌లో మూడు నెలల శిక్షణ

ఆర్థికంగా ఎదుగుదలకు సాయం

8



ప్రశ్నతోనే కొత్త ఆవిష్కరణలకు నాంది

» అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

» బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 398 ఎగ్జిబిట్లు



ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

వికారాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నతోనే కొత్త ఆవిష్కరణలకు నాంది పడుతుందని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం, పరిశీలనా వైఖరిని అలవరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కొత్తగడిలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి సన్నివేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎందుకు.. ఎలా అనే ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడమే సైన్స్ అని ఆమె చెప్పారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలకు బీజం వేసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి

జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవి మాట్లాడుతూ మానవుడి జీవితంలో ప్రతిక్షణం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. వేదకాలం నుంచి జరిగిన అనేక విషయాలను సైన్స్ ద్వారా అవగాహన చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిలత మాట్లాడుతూ, విద్యార్థులు తమలోని శాస్త్రీయ పరిశీలన దృక్పథంతో రూపొందించిన ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ కొత్త విషయాలను నేర్చుకోవాలని ఆమె సూచించారు. జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ మాట్లాడుతూ సైన్స్ అనే మూల స్తంభంపైనే ఈ ప్రపంచం ఆధారపడి ఉందని అన్నారు. బాల వైజ్ఞానిక ప్రదర్శకు 398 ప్రదర్శనలు, ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనకు 55 ప్రదర్శనలు వచ్చాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, డి.అమర్‌నాథ్, వెంకటరత్నం, రాములు, సత్యనారాయణ రెడ్డి, సుదర్శన్, అంజిరెడ్డి, మహేందర్ బహదూర్, వేణుగోపాల్, షఫీ, మల్లేశం, వివిధ మండలాల విద్యాధికారులు, గెజిటెడ్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

టీబీ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ

బొంరాస్‌పేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీబీ రోగులకు ఉచితంగా మందులు, ప్రతీ నెల పౌష్టికాహారం కోసం రూ.1000 అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్ తెలిపారు. 'టీబీ అలర్ట్ ఇండియా' సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన శిబిరంలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మందిని పరీక్షించగా 12 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో వైద్యుడు అక్షయ్, రాజేశ్వరి, సీహెచ్‌వో శివరాజ్, టీబీ హెచ్ఐవీ రాజునాయక్, సాయిశంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రహత్ పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే!



» సర్వేల్లో అధికారులు బిజీబిజీ

» కుటుంబ, పంట సర్వే పూర్తికాక ముందే ఇళ్ల సర్వే షురూ..

» ముందుకు సాగని అభివృద్ధి పనులు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ వైపు సర్వేలు, మరో వైపు శాఖా బాధ్యతలు.. ఎన్నికల విధులు.. నిత్యం సమావేశాలు.. ఊపిరాడని పనులతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే, పంట సర్వే.. ఇంకా ఈ సర్వేలు పూర్తి కాకముందే తాజాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపట్టింది. ప్రస్తుతం గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్వేలతో పాటు ఇతర కార్యక్రమాలతో అధికారులు వారి విధులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. దీనితో అభివృద్ధి కుంటుపడుతోంది. తాజాగా పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను విడుదల చేసి సర్వే చేయాలని ఆదేశించింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని గ్రామాల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. గ్రామాల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులది కీలక పాత్ర. ఏ పనులు నిర్వహించాలన్నా వారు ఉండాల్సిందే. దాదాపు మూడు నెలలుగా కార్యదర్శులు, మున్సిపాలిటీ అధికారులు సర్వేలతోనే బిజీగా గడుపుతున్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోతున్నాయి.

నెల రోజుల పాటు..

అధికారులు తీరిక లేకుండా వివిధ కార్యక్రమాలతో బిజీగా ఉంటుండటంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. కనీస అవసరాలైన తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల వంటి సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీనితో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా త్వరలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఎన్నికల కమిటీ నిబంధనల మేరకు ఏర్పాట్లను కూడా చూడాల్సిన పరిస్థితి. ఓటరు లిస్టు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను సైతం పరిశీలిస్తున్నారు. జిల్లా అధికారులను కూడా గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించడంతో వారు ఇప్పటి వరకు సదరు గ్రామాలవైపు కన్నెత్తి చూసే సమయం కూడా వారికి లభించడం లేదు. దీనితో గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. ఈ నెల 31వ తేదీలోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. దీంతో ప్రస్తుతం జిల్లా అధికారులతో మొదలుకుని వార్డు అధికారి వరకు అందరూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలోనే బిజీగా ఉన్నారు. ఈ సర్వే పూర్తయితేనే అధికారులు వారి వారి విధుల నిర్వహణలో చేరుతారు. అప్పటి వరకు ఈ తిప్పలు తప్పేలా లేవని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

అధికారులతో వ్యాపారస్తుల వాగ్వాదం

అడ్డుకునే ప్రయత్నం చేసిన బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని ప్రధాన మార్కెట్‌లో మున్సిపల్ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం మూడో రోజు గురువారం కొనసాగింది. హౌజింగ్ బోర్డు రోడ్డు ప్రధాన రోడ్డు మూసేసి వాహనాలను పట్టణంలోని ప్రధాన మార్కెట్ రోడ్డు వైపు మళ్లించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు ఇరువైపున ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. వివేకానంద చౌరస్తా నుంచి మహవీర్ చౌరస్తా వరకు ఆక్రమణలను తొలగించగా గురువారం 44వ జాతీయ రహదారి అంబేద్కర్ విగ్రహం నుంచి మహవీర్ చౌరస్తా వరకు రోడ్డు ఇరువైపుల ఇబ్బందికరంగా ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో అధికారులు తొలగించారు. ఈ విషయమై అధికారులతో స్థానిక వ్యాపారస్తులు వాగ్వాదం జరిగినప్పటికీ భారీ బందోబస్తు మధ్య దుకాణాల ముందు ఏర్పాటు చేకున్న మెట్లను, ఇతర పార్కింగ్ షెడ్‌లను తొలగించారు. అదేవిధంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారికి సమీపంలో ఉన్న డబ్బాలను, ఇతర ఆక్రమణలను అధికారులు తొలగించారు.

కూల్చివేతలు సరికాదు

వ్యాపారస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్థానిక మున్సిపల్ అధికారులు ఆక్రమణల పేరిట కూల్చి వేతలు జరపడం సమంజసం కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆయన ఆక్రమణలు తొలగిస్తున్న ప్రధాన మార్కెట్ వద్దకు చేరుకుని మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఏళ్లుగా రోడ్డు పక్కన చిన్నపాటి దుకాణాలు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న నిరుపేదల జీవితాలను రోడ్డుపాలు చేయడం శోచనీయమన్నారు. ఆక్రమణల పేరిట వ్యాపారస్తుల దుకాణాలను కూల్చివేయడం కక్షపూరిత చర్యగా పేర్కొన్నారు. విస్తరణ పేరిట వ్యాపారస్తులను అధికారులు భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కాగా, రోడ్డుపై ప్రయాణించే వాహనాలతో మార్కెట్‌లోని వ్యాపారస్తులకు, స్థానికులకు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు ఇరువైపుల ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పుగా ఉంటే వాహనాలు సాఫీగా ముందుకు వెళ్తాయన్నారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించాలని ఏసీపీ సూచించారు.



పోలీస్ బందోబస్తు నడుమ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుడు రాములయ్య అన్నారు. తలకొండపల్లిలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభల విజయవంతంపై సన్నాహక సమావేశాన్ని మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. సమస్యల పరిష్కారం, జిల్లా మహాసభల విజయవంతంపై చర్చించారు. ఈ నెల 14, 15 తేదీల్లో షాద్‌నగర్‌లో నిర్వహించే మహాసభల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలకు ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు తరలొచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, టీచర్లు రవి, రియాజ్, సర్వేశ్వర్, విజయశ్రీ, రాణి పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. క్రీడల్లో రాణించి!


బ్యాటింగ్ చేస్తున్న నరేశ్


బౌలింగ్ చేస్తున్న నరేశ్

- జాతీయస్థాయి దివ్యాంగ పోటీల్లో యువకుడి ప్రతిభ
- తెలంగాణ జట్టులో కీలకపాత్ర

కులకచర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని సాధించడంలో అంగవైకల్యం అడ్డుకాదని చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన సంధిగారి నరేశ్ నిరూపించాడు. నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో నరేశ్ ప్రతిభ చాటాడు. మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ వీల్‌చైర్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ వీల్‌చైర్ జట్టు 7వికెట్ల తేడాలో విజయం సాధించింది. టోర్నీలో పాల్గొన్న సంధిగారి నరేశ్ బెస్ట్ బౌలర్‌గా రాణించారు. ఉమాంగ్ గౌరవదీప్ నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయారాష్ట్రాల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి సంధిగారి నరేశ్ రాష్ట్రానికి ప్రథమ బహుమతి సాధించడంలో కీలక భూమిక పోషించారు. ఓపెనింగ్ బౌలర్‌గా రాణించి తెలంగాణ విజయంలో కీలక పాత్రధారిగా మారాడు.

> **తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధించా**
>
> ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కష్టపడితే సాధించలేనిది ఏదీలేదు. అందుకు అంగవైకల్యమూ అడ్డు కాదు. తల్లిదండ్రుల ఆశీస్సులు నన్ను ఇంతటి వాడిని చేశాయి. వారి ప్రోత్సాహంతోనే దివ్యాంగ క్రీడల్లో విజయం సాధించా. ప్రభుత్వం త్రీవీలర్ స్కూటీ ఇస్తే బాగుంటుంది.
>
> *- సంధిగారి నరేశ్*

15ఏళ్ల వయసులో ప్రమాదం

నరేశ్ 15ఏళ్ల వయసులో 2006లో దోమ మండలంలోని దాదాపూర్ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన ఆటో ప్రమాదంలో వెన్నెముక విరిగి మంచానికే పరిమితమయ్యాడు. చిన్నతనంలోనే మంచానికే పరిమితమైనా ఇక జీవితంలో పైకి ఎదగడం అసాధ్యం అనుకున్న తరుణంలో తల్లిదండ్రులు నర్సమ్మ, నర్సింహులు ప్రోత్సాహంతో కొన్ని సంవత్సరాలకు మెల్లగా కోలుకొని వీల్‌చైర్ సాయంతో జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. చదువుతో పాటు వీల్‌చైర్ క్రికెట్‌లో ప్రావీణ్యాన్ని పొందాడు. ఆటలో అత్యుత్తమంగా రాణిస్తూ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ దేశస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు.


రాష్ట్ర మంత్రి సీతక్కతో నరేశ్

క్రీడల్లో రాణిస్తూ..

ఆటలపై మక్కువతో నరేశ్ వీల్‌చైర్ క్రికెట్ ఆడటం మొదలుపెట్టాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో ఆడుతూ తెలంగాణ టీం విజయాల్లో భాగమయ్యాడు. ఢిల్లీ, రాజస్తాన్, ముంబై, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో జరిగిన క్రీడాపోటీల్లో పాల్గొన్నాడు. తెలంగాణలో జరిగిన అనేక టోర్నమెంట్‌లో పాల్గొని అప్పట్లో క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో బహుమతులు అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన దివ్యాంగ వీల్‌చైర్ ప్రీమియర్ లీగ్‌లో క్రీడల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఢిల్లీలో జరిగిన ఇండియన్ వీల్‌చైర్ ప్రీమియర్ లీగ్‌సీజన్ 3, 4, 5 తెలంగాణ తరఫున హైదరాబాద్ జట్టులో అటవీ శాఖ మంత్రి సీతక్కతో సన్మానం పొందారు. తెలంగాణ జట్టులో ఓపెనింగ్ బౌలర్‌గా రాణిస్తూ పలు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. వీల్‌చైర్ క్రికెట్‌తో పాటు రాష్ట్ర స్థాయిలో జరిగిన పారగేమ్స్ షార్ట్‌పుట్, జావెలియన్ త్రో, డిస్కస్ త్రో మెడల్స్ సాధించారు.



తెలంగాణ వీల్‌చైర్ జట్టులో ఎడమ నుంచి కుడికి మూడో వ్యక్తి నరేశ్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: డీఎస్పీ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ కొత్త బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తాండూరు డీఎస్పీ కొత్త బాలకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో ఇండియా సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం కరన్‌కోట్ ఎస్‌ఐ కె.విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇండియా సిమెంటు యాజమాన్యం సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.9లక్షలు అందించి ఏర్పాటుకు సహకరించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఐసీఎల్ కర్మాగారం హెడ్ శ్రీనివాస్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సుదానిరంజన్, కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, పటేల్ రాంరెడ్డి, ఐసీఎల్ కర్మాగారం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సదానిరంజన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగప్ప, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, గోపాల్, మల్‌రెడ్డి, నారాయణరెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జర్నప్ప, ఉదయభాస్కర్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఫైనలైజేషన్‌పై సమావేశం


నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాలు ఎన్నికలకు అనువుగా ఉన్నాయా? మార్పులు చేర్పులు చేయాలా? అన్న అంశంపై ఎంపీడీవో నరేందర్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల ఫైనలైజేషన్, ఓటర్ లిస్టుల్లో మార్పులు చేర్పులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మంతన్‌గౌరెల్లి, ధర్మన్నగూడ, గడ్డమల్లయ్యగూడ, నానక్‌నగర్ గ్రామాల్లో వరండాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారని, వాటిని గదుల్లోకి మార్చాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనపై నాయకులు సహకరించాలని కోరారు. ఫైనల్ పబ్లికేషన్ ఈ నెల 17న ఉంటుందన్నారు. బీఆర్ఎస్ నుంచి వి.రాజునాయక్, బీజేపీ నుంచి టి.రవీందర్, మేకల యాదగిరిరెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన అంగన్వాడీలు


గూడూరు నుంచి హైదరాబాద్‌కు తరలుతున్న అంగన్వాడీ టీచర్లు

కందుకూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు అంగన్‌వాడీలు గురువారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన కార్యక్రమానికి తరలారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని ఇచ్చిన హామీని సీఎం అయ్యాక నెరవేర్చడం లేదన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హాస్టల్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా


తాండూరు గిరిజన బాలికల హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, పరామర్శకు వస్తున్న మాజీ మంత్రులను అడ్డుకోవడం సరికాదని గురువారం తాండూరు గిరిజన బాలికల హాస్టల్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులను పరామర్శించేందుకు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవత్ రాథోడ్‌లను వికారాబాద్‌లోనే అరెస్ట్ చేయడాన్ని వారు ఖండించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి కలెక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దీప నర్సింహులు, రాజుగౌడ్, శ్రీనివాస చారీ, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన శ్రీనివాస్ స్వామీజీకి సన్మానం


ఎక్మాయిలోని ఆశ్రమంలో స్వామీజీని సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు గోపిరజక, తదితరులు

బషీరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యోగా సంస్కృతం యూనివర్సిటీ ఫ్లోరిడాసిటీ (యూఎస్ఏ) వారి ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందిన చాకలి శ్రీ శ్రీనివాస్‌స్వామీజీని గురువారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపిరజక సన్మానించారు. మండలంలోని ఎక్మాయి గ్రామంలోని శ్రీబాలప్ప స్వామీజీ ఆశ్రమంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సి.రవీందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, పర్సాపూర్ లక్ష్మి, మండల అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

ఈకో టూరిజం అభివృద్ధికి స్థల పరిశీలన



సంగమేశ్వర ఆలయం పరిసరాల్లో పరిశీలిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈకో టూరిజం అభివృద్ధికి అధికారులు స్థల పరిశీలన కొనసాగించారు. చార్మినార్ జోన్‌చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలో పర్యటించారు. బొంరాస్‌పేట్ పెద్దచెరువు, సంగమేశ్వర ఆలయం చుట్టూ ఉన్న రిజర్వు ఫారెస్టును వారు పరిశీలించారు. సంగమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి బొంరాస్‌పేట్ పెద్దచెరువు, చెరువు పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈకో టూరిజం అభివృద్ధికి ఈప్రాంతం అనువుగా ఉంటుందని అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, కడా అధికారి వెంకట్‌రెడ్డి, అధికారులు సబిత, సిబ్బంది ఉన్నారు.

జైలులో గుండెపోటు వచ్చినా కర్కశత్వమా?



పరిగిలో మాట్లాడుతున్న గట్యానాయక్

పరిగి,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో జైలులో ఉంటున్న రైతుకు గుండెపోటు వచ్చినా ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించడమేంటని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ విమర్శించారు. పరిగిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కోసం పోరాడిన వీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో గుండెపోటు వస్తే ఒక ఉగ్రవాదిలా పోలీస్‌వాహనంలో బేడీలతో ఆస్పత్రికి తీసుకెళ్లడం విచారకరమన్నారు. వీర్యానాయక్‌కు ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. భూమి ఇవ్వబోమంటే అక్రమ కేసులుపెట్టి జైలుకు పంపడం, జైలులో కూడా హింసించడమేంటని ప్రశ్నించారు. అక్రమ కేసులు ఎత్తివేసి వారిని జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు హరినాయక్, దోమ మండల అధ్యక్షుడు రవీందర్‌నాయక్,బాబ్యానాయక్,రవీందర్‌లు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో క్లోరల్ హైడ్రేడ్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న సీహెచ్‌తో బషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులతో పట్టుబడిన వ్యక్తి

బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పోలీసులు ఓఇంట్లో తనిఖీలు నిర్వహించగా 5 కిలోల సీహెచ్(క్లోరల్ హైడ్రేట్) పట్టుబడింది. మండల కేంద్రంలోని కొడంగల్ వరప్రతాప్‌గౌడ్ ఇంట్లో సీహెచ్ అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నడానే సమాచారం మేరకు జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి విజయ్‌భాస్కార్‌గౌడ్ ఆదేశానుసారం తాండూరు సీఐ బాలగంగాధర్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది బుధవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ మేరకు సీహెచ్‌ను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని విచారించారు. కర్ణాటక రాష్ట్రం నాగరాజుగౌడ్ వద్ద పెద్ద మొత్తంలో సీహెచ్ తీసుకువచ్చి కల్లు దుకణాలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని తాండూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. గురువారం సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపరిచారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ నిజామొద్దీన్, సిబ్బంది మహేష్, సతీష్, శ్రీనివాస్, బీమయ్య, సుల్తాన్, కిషోర్, రాజేందర్ పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా ప్రకటించే వరకు పోరాటం ఆపం అని జేఏసీ నాయకులు అన్నారు. మండల సాధన కోసం జేఏసీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారంతో 42వ రోజుకు చేరాయి. వివిధ రాజకీయ పార్టీల, సంఘాల నాయకులు, మహిళలు, యువకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజల డిమాండ్‌పై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని జేఏసీ నాయకులు కోరారు. దీక్షల్లో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు అంజనేయులుగౌడ్, బాల్‌రామ్, అంజయ్య, శివయ్య, రవి, ఖాజా, రాజు, నిరంజన్, రవినాయక్, మహేశ్, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీటీ బాలక్రిష్ణారెడ్డి

శంకర్‌పల్లి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని శంకర్‌పల్లి ఉప తహసీల్దార్, ఎస్సీ బాలుర హాస్టల్ ప్రత్యేకాధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. శంకర్‌పల్లి వసతి గృహంలో గురువారం రాత్రి విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడప్పుడు భోజనం బాగుండదని విద్యార్థులు ఆయనతో చెప్పారు. మెనూ ప్రకారం భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని వార్డెన్ పాండును ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఆయనతో పాటు వీఆర్ఏ రాజశేఖర్ ఉన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు

వికారాబాద్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): న్యూస్ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడం సరికాదని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ అన్నారు. మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేస్తూ అదనపు కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వైద్యనాథ్, గిరీష్ స్వామి, రాఘవేందర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

వారంరోజుల్లో నాటు వేస్తాం



"నాలుగు ఎకరాల్లో వరి సాగు చేయడానికి పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. ఈ సీజన్‌లో హైబ్రిడ్ రకమైన జియోమిక్స్ వరిరకం నారుపోశాను. మరో వారం రోజుల్లో వరినాట్లు వేస్తాం. పంట కాలువలను చదును చేసుకున్నాం.

- కె.ఉదయ్‌కుమార్‌రెడ్డి, రైతు, ఎదులాబాద్

సాగుకు సన్నద్ధం

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ

- ఘట్‌కేసర్‌లో 4200 ఎకరాల్లో వరిసాగు
- ఎరువులు అందుబాటులో ఉంచాం: వ్యవసాయ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగు ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వానాకాలం సీజన్ ముగియగానే రైతులు తమ పొలాల్లోని గడ్డి, చెత్తాచెదారాన్ని శుభ్రంచేసి, నారుమడులను సిద్ధం చేసుకున్నారు. మరో 10, 15 రోజుల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్, అంకుశాపూర్, మర్రిపల్లిగూడలతో పాటు మూసీపరివాహక ప్రాంత గ్రామాలైన ఎదులాబాద్, పోతరాజిగూడ,



ఎదులాబాద్‌లో గట్లు చదును చేస్తున్న రైతు

మాదారం, కొత్తగూడెం, కొర్రెముల, వెంకటాపూర్, ప్రతాప్ ఎసింగారం, కాచవానిసింగారం, ముత్వేల్లిగూడ తదితర గ్రామాల్లో వరినాట్లు వేయడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే రైతులు వరిపొలాలను దున్నడం, పొలం గట్లను శుభ్రం చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. యాసంగి సీజన్‌లో ఎంటీయూ 1010, కేఎన్ఎం 118, సన్నరకాలైన తెలంగాణ సోనా, హెచ్‌ఎంటీ సోనా, డబ్ల్యుజిల్ 14, బీపీటీ 5204ప్రైవేటు హైబ్రిడ్ రకాలైన విత్తనాల నారు పోసుకున్నారు. మండలంలో దాదాపు 4200ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. నాటుకు వారంరోజుల ముందే రైతులు తమ పొలాల్లో జింకు చల్లుకోవాలని, దీంతో వరిపైరులో జింకు లోపం రాకుండా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

దుక్కులు సిద్ధం చేసుకుంటున్నాం



వానాకాలం సీజన్ ముగియగానే యాసంగి సాగుకు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నాం. వరి పొలాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తగలబెట్టడం, గట్లను సరి చేయడం వంటి పనులు చేసుకుంటున్నాం. దొడ్డురకాలైన 3366, 3066 రకాల నారుపోశాను.

- మాయ శివకుమార్, రైతు, మర్రిపల్లిగూడ

ఎరువులు అందుబాటులో ఉంచాం



మండలంలో యాసంగి సాగు కింద దాదాపు 4200 ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఇందుకోసం ఎరువులను రైతు సేవాసహకార సంఘాల్లో రైతులకు అందుబాటులో ఉంచాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధారుకార్డు వెంట తీసుకొస్తే ఎరువులు ఇస్తారు. నాటువేసే రెండురోజుల ముందు జింకు చల్లితే జింకు లోపం రాకుండా వరిపైరు ఏపుగా పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది. జింకును డీఏపీ, ఇతర భాస్వరపు ఎరువులతో కలిపి చల్లకూడదు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

- ఎంఏ బాసిత్, మండల వ్యవసాయ అధికారి

మున్సిపల్ జేసీబీ ఎక్కడ?

- సమాచార హక్కుచట్టం కింద కోరిన కౌన్సిలర్
- ఆంధ్రజ్యోతి కథనంతో పాటు దరఖాస్తు



ఆంధ్రజ్యోతి కథనాన్ని చూపిస్తున్న కౌన్సిలర్ సంగీత ఠాకూర్

తాండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కార్యాలయం జేసీబీ ఎక్కడికి పోయిందని, వాటి వివరాలు అందజేయాలని కోరుతూ 20వ వార్డు కౌన్సిలర్ సంగీత ఠాకూర్ కోరారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆమె సమాచార హక్కు చట్టం కింద ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో పాటు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అసలు జేసీబీ ఎక్కడ ఉందని ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చాక వారం రోజుల్లో రప్పిస్తామని చెప్పిన అధికారులు నెలరోజులైనా తెప్పించలేదని ఆరోపించారు. అధికార పార్టీలో చేరిన చైర్‌పర్సన్, కమిషనర్‌తో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ జేసీబీతో ఏవార్డులకు ఎన్ని లక్షలు కేటాయించి నడిపిస్తున్నారని వాటి వివరాలను అందజేయాలని కోరారు. మున్సిపల్ జేసీబీని ఇక్కడ ప్రైవేట్ పనులకు నడిపిస్తున్నారని అనుమానాలు ఉన్నాయి. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు ప్రజలకు స్పష్టమైన వివరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టి సారించాలని కోరారు.

జనహితమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సకల జనహితమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ పనిచేస్తోందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. తలకొండపల్లిలో గురువారం నూతన ఏఎంసీ చైర్‌పర్సన్ గీతను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కుల సంఘం మండల అధ్యక్షుడు పల్లెమోని సుదర్శన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గీత దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గీత మాట్లాడుతూ.. కుల వృత్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సామాజిక అసమానతల నిర్మూలనే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు పాటుపడుతోందన్నారు. రూ.2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి అప్పుల భారాన్ని దించిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుకే దక్కిందన్నారు. సంక్రాంతి తరువాత అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి హక్కులను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.బాలయ్య, పాండు, అనిల్, మహేశ్, నాగరాజు, ఎస్.శేఖర్, బాలకృష్ణయ్య, బి.కుమార్, రాఘవేందర్, బాలకృష్ణ, శివ, యాదయ్య, చెన్నకిష్టయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మునుపెన్నడూ లేని విధంగా రూ.830కోట్లను పేదల వైద్య చికిత్సలకు అందించిందని తెలిపారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2.82లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పా రు. ఆమనగల్లులో రూ.17.5కోట్లతో కొత్త ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కడ్తాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇర్విన్, మాడ్గుల, తలకొండపల్లి, గట్టిప్పలపల్లి ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, వెంకటేశ్వర్లుగౌడ్, ఎస్.కొండల్‌రెడ్డి, జహంగీర్, కృష్ణ, బాబ, విజయ్, జక్కు అనంతరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు, యువకులు

ధారూరు, డిసెంబరుయ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి చెడు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కిష్టయ్య అనే ఉపాధ్యాయుడు మద్యం తాగి పాఠశాలలో విద్యార్థినులను తాకడం, గిల్లడం చేస్తూ తరగతి గదిలో సెల్‌ఫోన్‌లో పాటు పెట్టి డాన్సులు చేయించాడు. బాలికలు విషయాన్ని తల్లితండ్రులు చెప్పడంతో వారు పాఠశాలకు వచ్చి ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడిపై ఎంఈవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఎంఈవో పాఠశాలలో విచారణ జరిపారు. విద్యార్థినులతో మట్లాడి వివరాలు సేకరించారు. బాలికను వేధించిన కిష్టయ్యను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అటాచ్ చేయిస్తామని, విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులు సమర్పిస్తామని, వారే చర్యలు తీసుకుంటారని ఎంఈవో తెలిపారు.

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



మోమిన్‌పేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్తగడి గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో మండల కేంద్రంలోని వింటేజ్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రాజెక్టులో భాగంగా సహజ వ్యవసాయం, పారిశుధ్యం, శాటిలైట్, కమ్యూనికేషన్, ఆటోమెటిక్ డ్రైనేజీ క్లీనర్, డ్రిప్ ఇరిగేషన్, హైడ్రాలిక్ ప్రేషర్ లాంటి ప్రదర్శనలతో ప్రతిభ కనబర్చడంతో డీఈవో రేణుకాదేవి, అధికారులు విద్యార్థులను అభినందించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ చొరవ

మోడల్ స్కూల్ విద్యార్థులకు డైనింగ్ సదుపాయం



బెంచీలపై కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు.. ఫొటోలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగులూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థినులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ దాతల సహకారంతో డైనింగ్ సదుపాయం(బెంచీలు ఏర్పాటు) కల్పించారు. ఇటీవల కమిషనర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సమయంలో బాలికలు చెట్ల కింద కూర్చుని భోజనం చేయడం చూశారు. దీంతో ఆయన తాను కొంత ఖర్చు భరిస్తూ దాతల సహకారంతో ఈ సదుపాయం కల్పించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కమిషనర్ బాలకృష్ణకు కృతజ్ఞతలు చెప్పారు.

కుక్కలు రాకుండా ఇళ్లకు రంగునీళ్ల బాటిల్



రంగునీళ్ల వాటర్‌బాటిల్



దారూరులోని ఇంటి గోడలకు అమర్చిన

ధారూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): కుక్కలు తమ ఇళ్ల వద్దకు రాకుండా కాలనీ వాసులు చేసిన రంగునీళ్ల బాటిల్ ప్రయోగం విజయవంతమైంది. వికారాబాద్ జిల్లా ధారూరు మండల కేంద్రంలోని ఓ కాలనీవాసుల ఇళ్ల గోడలకు, ప్రహరీలకు పెట్రోల్ రంగు గల ద్రావణం నింపిన వాటర్ బాటిళ్లు వేలాడదీశారు. ఇలా ఎందుకు పెట్టారని కాలనీవాసులను ఆరా తీయగా కుక్కలు ఇళ్ల ముందుకు రాకుండా ఈ ప్రయోగం చేశామని చెబుతున్నారు. ఫుడ్ కలర్‌లో నీళ్లు కలిపి ద్రావణంగా తయారు చేసి వాటర్ బాటిళ్లలో నింపి గోడలకు తగిలించారు. పెట్రోల్ నింపిన వాటర్ బాటిళ్లలాగా కనిపిస్తున్న వాటిని చూసిన కుక్కలు ఆ ఇంటి దరిదాపుల్లోకి రాకుండ వెళ్లిపోతున్నాయి. ఇంతకు మునుపు ఇళ్ల ముందు కుక్కలు మల, మూత్ర విసర్జన చేయటంతో దుర్వాసన వచ్చేదని, ఈ బాటిళ్లు పెట్టినప్పటి నుంచి కుక్కలు రావడం లేదని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని వారు తెలిపారు. ఈ ఐడియా ఎలా వచ్చిందని ప్రశ్నించగా యూట్యూబ్‌లో వీడియో చూసి ఈ ప్రయోగం చేశామని కాలనీవాసులు చెప్పారు. అయితే దీనిపై ఎలాంటి సైంటిఫిక్ రీజన్ లేనప్పటికీ కాలనీ వాసులు ఈ విధానాన్ని అమలు చేయడం గమనార్హం.

జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో విద్యార్థిని ప్రతిభ


రితిషను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థిని ఎం.రితిష గణిత ప్రతిభా పరీక్షలో జిల్లాస్థాయిలో మొదటి స్థానంతో పాటుగా రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షలకు ఎంపికైంది. హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రితిషను పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు గురువారం పాఠశాలలో ఉపాధ్యాయబృందంతో కలిసి సన్మానించారు.

కులగణన 95 శాతం పూర్తి

వికారాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ మునిసిపల్ పరిధిలో 95 శాతం సమగ్ర కుటుంబ సర్వే పూర్తయినట్లు మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. గురువారం చైర్ పర్సన్ నివాసంలో కులగణన సమగ్ర సర్వేలో భాగంగా మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మునిసిపల్ సిబ్బంది చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ దంపతులు స్వయంగా తమ కుటుంబ సమగ్ర వివరాలను రాశారు. ఏఈ అనిల్, ఆర్వో కృపాకర్ ఉన్నారు.

మహిళలకు అండగా 'స్ఫూర్తి'

- టైలరింగ్‌లో మూడు నెలల శిక్షణ
- ఆర్థికంగా ఎదుగుదలకు సాయం

కొడంగల్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్సీ నిరుద్యోగ మహిళలకు స్ఫూర్తిసంస్థ అండగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలోని గృహిణులు, యువతులకు టైలరింగ్‌పై మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నారు. కొడంగల్ మండలానికి చెందిన మహిళలకు, యువతులకు నెలరోజుల కిందట టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. స్థానిక అగ్రికల్చర్ కార్యాలయ ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలో


కొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో టైలరింగ్ శిక్షణ

టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారు. పార్వతి, సంపూర్ణ అనే ఇద్దరు శిక్షకులు కుట్టుశిక్షణపై వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువతులకు, మహిళలకు జాకెట్స్ పంజాబీ డ్రెస్‌లు తదితర వాటిని ఏవిధంగా కొలతలు తీసుకోవాలి, కటింగ్ ఏవిధంగా చేయాలి, కుట్టడంపై శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్ శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలను సంస్థ సమకూరుస్తోంది. గత సంవత్సరంలో ఈ టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలు కుట్టుశిక్షణ పొంది సొంతంగా ఇళ్లలోనే టైలరింగ్ పనిచేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. శిక్షణ అనంతరం సంస్థ ద్వారా అందించే సర్టిఫికెట్‌తో బ్యాంకుల ద్వారా రుణాలను సైతం పొందే అవకాశం ఉంది.

టైలరింగ్‌లో మంచి భవిష్యత్తు

టైలరింగ్ వృత్తికి మంచి డిమాండ్ ఉంది. చాలా మంది మహిళలు, యువతులు ఇంట్లో టైలరింగ్ చేస్తూ ఆదాయం పొందుతున్నారు. శిక్షణ పొందిన వారు ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని అభిరుచులకు తగ్గట్లుగా వస్త్రాలను కుట్టగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుంది.

- పార్వతి, టైలరింగ్ శిక్షకురాలు, కొడంగల్

కుట్టు మిషన్లు ఇస్తే బాగుంటుంది



టైలరింగ్ శిక్షణతో పాటు టైలరింగ్ పూర్తయిన తర్వాత అందరికీ కుట్టు మిషన్‌లు ఇస్తే చాలా మేలు కలుగుతుంది. టైలరింగ్‌పై శిక్షణ బాగుంది. నాలాగే ఇక్కడ చాలా మంది శిక్షణ పొందుతున్నారు.**- సరిత, కొడంగల్**

నెల రోజులుగా శిక్షణ పొందుతున్నా



స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో నెలరోజుల నుంచి టైలరింగ్ శిక్షణ పొందుతున్నాను. ఇంట్లో ఖాళీగా ఉండకుండా టైలరింగ్ శిక్షణతో జాకెట్స్ కొలతల ప్రకారం కటింగ్‌చేస్తూ కుడుతున్నాను. శిక్షణ పూర్తయ్యేలోపు జాకెట్స్, పంజాబీ డ్రెస్‌లు సొంతంగా కటింగ్, స్టిచ్చింగ్‌తో కుటుంబానికి అండగా ఉండాలన్నదే నా ఆలోచన.

- భాగ్యశ్రీ, అంగడిరైచూర్

క్రైం కార్నర్

స్నేహితుడే నిందితుడు

- పెళ్లి చేసుకుందామన్న యువతి దూరం పెట్టడంతో ఘాతుకం

కీసర రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యువకుడి హత్యకేసును కీసర పోలీసులు 24గంటలలోపే ఛేదించారు. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా మండలం, ఎల్లారెడ్డిగూడకు చెందిన మహిపాల్ అలియాస్ మహేష్(24) డీజే పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న మహేష్ హత్యకు గురైన విషయం తెలిసిందే. అతడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. మహేష్ పనిచేసే క్రమంలో ఆర్జీకే కాలనీకి చెందిన పృథ్వీరాజ్ అలియాస్ పృథ్వీకుమార్ అలియాస్ పువ్వు(27) పరిచయమై స్నేహితులుగా మారారు. తరువాత వారికి ఓ యువతి పరిచయమై మొదట పృథ్వీరాజ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే యువతి తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోలేదు. దీంతో యువతి పృథ్వీరాజ్‌ను దూరం పెడుతూ వచ్చింది. ఈ క్రమంలో అతడి స్నేహితుడైన మహేష్‌తో చేరువైంది. సదరు యువతి, మహేష్‌లు సన్నిహితంగా ఉండటాన్ని తట్టుకోలేక పృథ్వీరాజ్ మహేష్‌పై కక్ష పెంచుకున్నాడు. ఏలాగైనా మహేష్‌ను అంతమొందించి యువతిని పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ మిత్రుడైన మరోవ్యక్తితో మహేష్‌ను ఈనెల 10వ తేదీన దమ్మాయిగూడలోని మద్యంషాపునకు పిలుచుకున్నారు. అక్కడ మద్యం సేవించి బైక్‌పై ఎక్కించుకొని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు పక్కన ఆర్జీకే కాలనీ వెనుకభాగంలోని కొండపైకి తీసుకెళ్లాడు. అక్కడ వెంట తెచ్చుకున్న కత్తితో మహేష్ ఛాతిలో పొడిచి హతమార్చి పృథ్వీరాజ్ పరారయ్యాడు. నిందితుడి కోసం బృందాలుగా ఏర్పడిన పోలీసులు అతన్ని గురువారం ఆర్జీకే కాలనీలోని తన ఇంట్లో పృథ్వీరాజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

మహిళపై హత్యాయత్నం కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో తండ్రీకొడుకులు?

పూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం కేసులో పోలీసుల పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లోని చంద్రయాన్‌గుట్ట బండ్లగూడ ప్రాంతానికి చెందిన 42 ఏళ్ల మహిళను పని కోసం గుర్తుతెలియని వ్యక్తుల వికారాబాద్‌కు తీసుకువచ్చి హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. బండ్లగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీబీ ఫాతిమా అనే మహిళ, రాజు, శ్రీనివాస్ అనే తండ్రీకొడుకులు పనిచేస్తున్నారు. ఫాతిమా వద్ద డబ్బులు గమనించిన తండ్రీ కొడుకులు ఎలాగైనా డబ్బులు తీసుకోవాలని ఇద్దరూ కలిసి పతకం పన్నారు. పథకం ప్రకారం ఆమెను మరో చోట పనిఉందని, అక్కడ పనిచేసి సాయంత్రం వరకు తిరిగి రావచ్చని నమ్మించారు. అనంతరం ఆమెను వెంటబెట్టుకుని మన్నెగూడ సమీప ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడికి రాగానే ఆమె వద్ద ఉన్న డబ్బులు లాక్కుని, ఎలాగైనా ఆమెను చంపేయాలని కత్తితో తీవ్రంగా గాయపరిచారు. అక్కడ ఏదో శబ్ధం రావడంతో రాజు, శ్రీనివాస్‌లు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో అదే రోజు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. గురువారం తండ్రీ, కొడుకును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈకేసు విషయమై ఎస్‌ఐ మధుసూదనరెడ్డిని వివరణ కోరగా ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వెల్లడించారు. ఇదిలా ఉండగా కేవలం డబ్బులకోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టారా? లేక లైంగికదాడి చేసి, ఎక్కడ బయట పడుతుందనే భయంతో హత్య చేయడానికి యత్నించారనే కోణంలో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోమన్‌గుర్తిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గూడుపల్లి శ్రీనివాస్(46) కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ కొంతకాలంగా కుటుంబకలహాలతో పాటు కొంత అప్పులు కూడా ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 7.30గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య లలిత చీరతో ఉరేసుకున్నాడు. అప్పుడే ఇంటికి వచ్చిన పిల్లలు తలుపు తట్టినా తీయకపోవడంతో తన తల్లి, చుట్టు పక్కల వారికి తెలిపారు. వారు వచ్చి తలుపు తీసి ఉరేసుకున్న శ్రీనివాస్‌ను కిందికి దించారు. వెంటనే చికిత్సనిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దౌల్తాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కుదురుమళ్ల గ్రామ శివారులో బుధవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ట్రాక్టర్ యజమాని బుద్దప్పపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం


తాండూరు రూరల్: ఐనెల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు కప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహన్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదమని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్, బెల్కటూర్, ఐనెల్లి, మల్కాపూర్, రాంపూర్, గుండ్లమడుగుతండా, జినుగుర్తి, బిజ్వార్, గౌతాపూర్ గ్రామాలకు చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఎంపీడీవో విశ్వప్రసాద్, మున్సిపల్ కమిషనర్ విద్యాసాగర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ధారాసింగ్, ప్రభాకర్‌గౌడ్, నాగప్ప, రాందాస్, శ్రీనివాస్, హెచ్‌ఎం వైద్యనాథ్, పీఈటీలు యాదగిరి, బుగ్గప్ప, రవిశంకర్, బాలమణి పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని మజీద్‌పూర్‌లోని జైయిన్ హెరిటేజ్ పాఠశాల గ్రౌండ్స్‌లోకి మండల స్పెషలాఫీసర్, జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఖో ఖో క్రీడాపోటీల్లో అలియాబాద్, మజీద్‌పూర్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు గెలుపొందారు. కబాడ్డీ క్రీడాపోటీల్లో తుర్కపల్లి, అలియాబాద్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు విన్నర్లుగా గెలుపొందారు. వాలీబాల్ క్రీడాపోటీల్లో తుర్కపల్లి, మురహారిపల్లి పాఠశాలలకు చెందిన క్రీడాకారులు విన్నర్లుగా నిలిచారు. ఖోఖో క్రీడాపోటీల్లో బాలికల విభాగంలో అలియాబాద్, తుర్కపల్లి పాఠశాలకు చెందిన క్రీడాకారిణిలు రన్నర్లుగా గెలిపొందారు. కబడ్డీలో తుర్కపల్లి, అలియాబాద్ పాఠశాలలకు చెందిన క్రీడాకారిణిలు రన్నర్లుగా, వాలీబాల్ క్రీడాపోటీల్లో తుర్కపల్లి, మురహారిపల్లి పాఠశాలలకు చెందిన క్రీడాకారిణిలు రన్నర్లుగా గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఈవో వసంతకుమారి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, స్వాతిబట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: అన్నోజిగూడలో జరిగిన మున్సిపల్ స్థాయి సీఎం కప్ 2024 క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి గురువారం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, రవీందర్, మేనేజర్ అంజన్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఆవరణలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో ముగింపు కార్యక్రమానికి మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, మల్లేశ్‌యాదవ్, ఫసియొద్దీన్, సురేశ్, నాగేశ్, సుగ్రీవ్ పాల్గొన్నారు.

తాండూరు: మున్సిపాలిటీలో సీఎంకప్-2024 పోటీలు గురువారం చించోలి రోడ్డు మార్గంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ఈ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మూడు రోజులుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిలో కొనసాగుతున్న సీఎంకప్ క్రికెట్ టోర్నమెంట్‌లో 13 వార్డుకు చెందిన జట్టు గెలుపొందింది. విజేతలకు నిర్వాహకులు కప్‌ను అందజేశారు.


ఘట్‌కేసర్: విజేతలకు బహుమతులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

అదేవిధంగా మండలంలోని పాఠశాలల్లో సీఎం కప్ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల బాలుర గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో విజేతలకు ఎంపీడీవో రామకృష్ణ గురువారం ట్రోఫీలను అందజేశారు. క్రీడల్లో నైపుణ్యం కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, బీఎస్.ఆంజనేయులు, గోపాల్‌నాయక్, ఆనందం, షైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేతలతో ఎంపీడీవోల సమీక్ష

యాలాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం యాలాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుష్పలీల వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో పోలింగ్ స్టేషన్ల వివరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటయ్యగౌడ్, వడ్డె రాములు, హన్మంతు, అక్బర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం(కోట్‌పల్లి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం వివిధ పార్టీల ప్రతినిధులతో గ్రామపంచాయతీ వార్డుల ఫైనల్‌డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై గురువారం గురువారం కోట్‌పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డానియల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో నాగుపాము కలకలం


డైట్ కళాశాలలో కిటికీలో నుంచి వస్తున్న నాగుపాము

వికారాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డైట్ కళాశాలలో నాగుపాము కలకలం రేపింది. కళాశాల చుట్టూ పొదలు ఉండడంతో గురువారం ఓ తరగతి గదిలోని కిటికీ నుంచి నాగుపాము లోపలికి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అదేవిధంగా వికారాబాద్‌లో ఉన్న చాలా పాఠశాలలు, వసతి గృహాల చుట్టూ పొదలు ఉండడంతో ఎప్పుడు ఏవిషసర్పాలు వస్తాయోనని విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా మంజూరైన నిధులతో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పనులను ప్రారంభించనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు రూ.70లక్షలు, వార్డు నెం.7లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు రూ.1.33 లక్షలు, వార్డు నెం.6లో సీసీరోడ్డు పనులకు రూ.45లక్షలు, వార్డు నెం.5లో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.1.17లక్షలు, వార్డు నెం.7 వాటర్ ట్యాంకు నుంచి చిట్లపల్లి, ఐనన్‌పల్లికి బీటీ రోడ్డుకు రూ.1.40లక్షలు, వార్డు నెం.7లో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.70లక్షలు, బొప్పలి వెంకటప్ప నుంచి హనుమాన్ టెంపుల్, కుర్వ కాశప్ప ఇంటి నుంచి బుల్కాపూర్ కొప్పు నరేందర్ ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.1.15 లక్షలు, వార్డు నెం.11లో సీసీరోడ్డు పనులకు రూ.40లక్షలు, వార్డు నెం.4లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.1.20 లక్షలు, వార్డు నెం.3లో పర్సాపూర్ రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులకు రూ.28 లక్షలు, సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.1.22 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలి

కొడంగల్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మీయ భవన ప్రారంభోత్సవానికి కురుమ సోదరులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.నాగప్ప కోరారు. భవన ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కర్నాటక సీఎం సిద్దిరామయ్య, ఎమ్మెల్సీ ఎగే మల్లేశం హాజరవుతారని తెలిపారు.

మక్కలకు దిక్కేది?

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం గమనార్హం. జిల్లాలోని 20 మండలాల్లో ఖరీఫ్‌లో దాదాపుగా 50వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరాకు 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా. ఈ సీజన్‌కు గాను మొత్తం 8.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

భారీగా పెరుగుతున్న పెట్టుబడి

మొక్కజొన్నల కొనుగోలు చేయడంలో ప్రభుత్వ వైఖరి విచిత్రంగా ఉంది. రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు చేయూతనివ్వాల్సిన ప్రభుత్వమే తక్కువ ధరలను నిర్ణయిస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరలపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రైతులు పండించిన మొక్కజొన్నలకు ఇంకా ధరలు పెరుగాల్సిన అవసరం ఉంది. ఏటేటా పెట్టుబడి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా గిట్టుబాటు ధరను కల్పించడంలో విఫలమవుతందని విమర్శిస్తున్నారు. ఎవురులు, విత్తనాలు, కూలీల ధరలు గత ఏడాదికి ఇప్పటికే పోలిస్తే రెండింతలు పెరిగిపోయాయి. మక్కల ధరలు అలాగే ఉందని రైతులు వాపోతున్నారు. కనీసం మార్కెట్‌కైనా వెళ్తే కనీస లాభాలన్నా దొరుకుతాయంటే అదీ లేకుండా పోయింది.

పొలాల నుంచే ఇతర రాష్ట్రాలకు..

జిల్లాలో పండించిన మొక్కజొన్నలను మార్కెట్‌కు రాకుండానే 50 శాతం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారుల రైతుల నుంచి కొనుగోలు చేసిన మక్కలను ఎక్కువగా కాకినాడతోపాటు, ముంబయికి తరలిస్తుంటారు. అలాగే స్థానికంగా పౌల్ట్రీఫామ్స్, బీరు, వీస్కీ తయారు చేసే ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న మక్కలు మార్కెట్ ఫీజును ఎగవేసి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పొలాల నుంచి నిత్యం వందల లారీల వరకు పన్నును ఎగవేసి అక్రమంగా తరలిస్తున్న మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతుంటే రికార్డుల్లో చూపుతున్నది మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. గత శుక్రవారం ఒక్క పరిగి మార్కెట్‌కు 10 వేలకుపైగా బస్తాల మొక్కజొన్నలు వచ్చాయి. కానీ ఇక్కడ మార్కెట్‌ను శాసించేది వ్యాపారులే కావడంతో మార్కెట్‌కు ఫీజు ఇవ్వకుండా తరలిస్తున్నారు. అయితే కొందరు వ్యాపారులు మార్కెట్ నుంచి వే బిల్లు తీసుకోకుండానే దొంగ వే బిల్లు రశీదులతో కూడా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పొలాల్లోని రైతుల దగ్గర పొలాల్లో, పరిగి, వికారాబాద్, తాండూరు, మర్పల్లి తదితర మార్కెట్‌లలో రైతుల ఎదుటే మోసాలు చేస్తున్న దుస్థితి.

మార్కెట్‌కు భారీగా మక్కలు



పరిగి మార్కెట్‌కు భారీగా మక్కలు వస్తున్నాయి. ఎంఎస్‌పీ కంటే ఓపెన్ మార్కెట్‌లో ధర ఎక్కువగా పలుకుతున్న విషయం వాస్తవమే. రైతులకు న్యాయం చేసేందుకే పని చేస్తున్నాం. తూకాల్లో మోసం చేస్తే ఊరుకోం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పన్ను ఎగవేసి మక్కలను తరలించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం.

-విజయకిశోర్, మార్కెట్ కార్యదర్శి, పరిగి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొడంగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాదేవ శివాలయంలో గురువారం చాతుర్మాస ముగింపు సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం, అష్టోత్తర శతనామవళి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వికారాబాద్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయాలు, పువ్వులతో అందంగా ముస్తాబు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి హారతులు ఇచ్చి దైవ సంకీర్తనలు ఆలపించారు.

పూడూరు: చీలాపూర్‌లో గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వీరభద్ర భజన మండలి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహప్రతిష్ఠాపన

పరిగి: పెద్దమాదారంలో కొత్తగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం(నేడు) నుంచి మూడు రోజుల పాటు విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగనున్నాయి. మాజీ సర్పంచ్ బోయిని రాములు సొంత డబ్బులతో ఈ ఆలయాన్ని నిర్మించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి లొంక ఆంజనేయస్వామి జాతర

పరిగి మండలం కాళ్మాపూర్ గ్రామ శివారులోని శ్రీశ్రీశ్రీ లొంక ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఈ ఉత్సవాల కోసం నిర్వాహకులు అన్నిఏర్పాట్లు చేశారు. శుక్రవారం(నేడు) ఉదయం గణపతిపూజ, కలశస్థాపన, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, శ్రీఆంజనేయస్వామి సహస్రనామం, భజన కార్యక్రమాలు ఉంటాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


బషీరాబాద్: విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్, ఎస్‌ఐ శంకర్

దోమ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు అన్నారు. మండలంలోని ఉదన్‌రావుపల్లి, దోమ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీను పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మధ్యాహ్న భోజనం కోసం సరఫరా అయ్యే బియ్యం సరిగా లేకుంటే తిరిగి పంపించాలని ఎంపీడీవో వెంకన్నగౌడ్ ఆదేశించారు. ఆయన గురువారం కాకర్లగండి తండా, బుర్రితండా పాఠశాలలను, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎస్‌ఐ పి.శంకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, బియ్యం, కూరగాయలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. అక్కడున్న మెట్రిన్ రాధికతో అన్న మెత్తబడుతుందనే విషయమై తహసీల్దార్ ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో జరిగిన మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో కార్మికులకు ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఘట్‌కేసర్ మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడుగా లొట్టి ఈశ్వర్, అధ్యక్షురాలుగా జి. సువర్ణ, ఉపాధ్యక్షులుగా శ్రావణి, శోభ, భూపాల్, వర్కింగ్ ప్రసిడెంటుగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, సహాయ కార్యదర్శులుగా రాంకుమార్, గణేష్, కోశాధికారిగా అరుణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఈశ్వర్, జయచంద్ర మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

పరిగి: తాండూరు గిరిజన వసతిగృహంలో ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన వారిని పరామర్శించడానికి వెళుతున్న మాజీమంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ వారికి మద్దతుగా వెళుతున్న వికారాబాద్ బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ఇతర నాయకులను పరిగి పీఎస్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థుల కష్టాలను తెలుసుకునేందుకు వెళితే అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శించారు. పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు సురేందర్, ఆర్.అంజనేయులు, నాయకులు బి.ప్రవీన్‌రెడ్డి మంత్రులకు సంఘీభావం తెలిపారు.

నల్సార్‌లో ఇద్దరు కొత్త ప్రొఫెసర్ల నియామకం

శామీర్‌పేట: నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో కొత్తగా ఇద్దరు ప్రొఫెసర్లను నియమించినట్లు వైస్‌చాన్స్‌లర్ శ్రీక్రిష్ణదేవరావు తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. డాక్టర్ టీవీఎస్‌ఎన్ ప్రసాద్, డాక్టర్ సీతారాం కాకరలను నియమించినట్లు వైస్‌చాన్స్‌లర్ వివరించారు. ఈ అధ్యాపకులు మానవహక్కులు, పబ్లిక్ పాలసీ రంగాల్లో బోధన, పరిశోధన రంగాల వికాసానికి తోడ్పడతారని ఆయన తెలిపారు.

కార్మికుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

పెద్దేముల్: మండలంలోని జనగాం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు చాకలి నర్సింహులుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ప్రభుత్వ స్థలంలో నిలిపినందుకు ఆస్థలం తనదని యాదప్ప, పెంటప్ప, అరుణ్‌కుమార్, వెంకటప్ప, నరేష్, అంజి అనే వ్యక్తులు దౌర్జన్యంగా దాడిచేశారని ఆరోపిస్తూ మండల తహశీల్దారు, ఎస్‌ఐలకు చేశారు.

రేపు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు

పరిగి: పరిగిలో రేపు(శనివారం) నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని ఎంఈవో ఎం.గోపాల్, మహాసభల నిర్వహణ కమిటీ కన్వీనర్ వెంకటయ్య, మండల సంఘం అధ్యక్షుడు దశరథ్‌లు కోరారు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్ నెం.01 పాఠశాల ఆవరణలో గురువారం సభకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.వెంకటయ్య, బి.బిచ్చయ్య, జైపాల్, హన్మంత్, హన్మంత్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

దోమ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, ఎక్స్‌రే, మందులతో పాటు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు ఫౌండర్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు యూనిఫాం పంపిణీ

కులకచర్ల: చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏల్పాటి అశోక్‌కుమార్, స్వరూప, మన్యం, చెన్నయ్య, గోపాల్‌నాయక్, నారాయణ, రఘు, నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లులేని పేదల వివరాల సేకరణ

పూడూరు: మండలంలోని ఎన్కెపల్లిలో నివాసం లేని నివాసాలు లేని నిరుపేదల వివరాలను ఎంపీడీవో పాండు సేకరించారు. డీపీవో జయసుధతో కలిసి గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో భాగంగా వివరాలను సేకరించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరును పరిశీలించారు.